విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 30, జూన్ 2025

కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు పెద్దిరెడ్డి మౌలాలిరెడ్డి, షేక్షావలి రెడ్డి డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు పెద్దిరెడ్డి మౌలాలిరెడ్డి, పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతినెల చివరి ఆదివారం పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా భోజన వసతి కల్పించారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాలలో ఆదివారం వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజల ముందుకు తీసుకు వచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలపాలని, నేడు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో అనే కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో ప్రజల వద్ద వెళ్లి కూటమి ప్రభుత్వం, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోవడం వల్ల ప్రజలకు కలిగిన నష్టాలను వివరించాలని రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, నందికోట్కూర్ ఇంచార్జి డా. ధార సుధీర్, నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాంకో ఎదుట ఆందోళన

రైతులు తరలిరావాలని రైతు సంఘం నాయకుల పిలుపు

బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పంట నష్ట పరిహారంతో పాటు బాధిత రైతులకు న్యాయం చేయాలన్న ప్రధాన డిమాండ్లపై రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట సోమవారం ఆందోళన నిర్వహిస్తున్నామని రైతులు, యువకులు తరలివచ్చి విజయవంతం చేయాలని రైతు సంఘం (ఏఐకెఎస్) మండల కార్యదర్శి బి.పుల్లయ్య కోరారు. బాధిత రైతుల సమస్యలపై రాంకో యజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించిన సరైన స్పందన లేదని విధి లేని పరిస్థితిలో ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. ఈనెల నాలుగో తేదీన రాంకో సిమెంట్ యాజమాన్య ప్రతినిధులతో రాష్ట్ర జిల్లా రైతు సంఘం, సిపిఐ నాయకులు చర్చల సందర్భంగా బాధిత రైతుల డిమాండ్స్ ను తెలిపామన్నారు. రాంకో ఫ్యాక్టరీకి భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని, పరిశ్రమ నుండి రైతులను కాపాడాలని, ఐదు సంవత్సరాలగా రాంకో నుండి వెలువడుతున్న కాలుష్యం వలన చుట్టుపక్కల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, స్థానిక యువతకు పరిశ్రమలో 75శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రాంకో రైతుల నుండి కొనుగోలు చేసిన భూములలో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అనుమతించాలని, రాంకోనుండి దేవాదాయ భూములను కాపాడాలని తదితర సమస్యలపై ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. రామ్కోకు భూములు కోల్పోయిన ఆయా గ్రామాల రైతులు యువకులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కరుణించని వరుణుడు

- ▸▸ జూన్ నెల ముగుస్తున్న కురవని వర్షాలు
- ▸▸ వర్షం కోసం రైతన్నల ఎదురుచూపులు
- ▸▸ ముందుకు సాగని ఖరీఫ్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆరుగాలం కష్టపడి రెక్కలను ముక్కలు చేసుకుని కష్టాన్నే దైవంగా నమ్ముకుని పంటలను సాగుచేసే కర్షకులపై వరుణుడు కరుణించడం లేదు. ప్రతి ఏటా అతివృష్టి, అనావృష్టి, ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో మే నెలలో వరుణుడు రైతన్నలను మురిపించాడు. సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షాలు కురిసాయి. దీంతో రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. రైతులు సాగుకు సిద్ధమయ్యారు. కొంతమంది రైతులు పొలాలు సేద్యాలు చేసి మొక్కజొన్న , మినుము, బెండ, పెసర తదితర పంటలు సాగు చేశారు. మరో పక్క అనేక మంది రైతులు తమ పొలాలను దుక్కి దున్ని సేద్యం చేసి విత్తనాలను కొనుగోలు చేసుకుని సిద్ధపరుచుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. నైరుతి ఋతుపవనాలు మందగించడంతో జూన్ నెల ముగుస్తున్న వాన జాడే కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్లో 38,091 హెక్టార్లలో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, కంది, మిరప, ఉల్లి , కొర్ర , పెసర తదితర పంటలను సాగు చేస్తారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం లో రైతన్నలు ఎక్కువగా వరి పంటను దాదాపు 20 వేల హెక్టార్లలో సాగు చేస్తారు. మొక్కజొన్న పంట సాధారణ సాగు 7059 హెక్టార్లు కాగా ప్రస్తుతం 8200 హెక్టార్లలో సాగు చేపట్టారు . గత సంవత్సరం లాభాలు కురిపించిన మొక్కజొన్న వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలోని చాగలమర్రి, ఆళ్లగడ్డ , రుద్రవరం మండలాల పరిధిలో ఈ ఏడాది సీడ్ మొక్కజొన్న దాదాపు 1000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు .అలాగే మినుము పంటను 4720 హెక్టార్లలో రైతన్నలు సాగు చేస్తారని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటివరకు కేవలం 30 శాతం మాత్రమే పలు రకాల పంటలు సాగయ్యాయి. గత సంవత్సరం పంటలు బాగా పండిన.. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం నైరుతి ముందే రావడంతో మే నెలలో వర్షాలు దంచి కొట్టాయి. గత సంవత్సరం నష్టపోయిన రైతులు ఈ సంవత్సరం ముందస్తు వర్షాలు కురవడంతో పంటలను సాగు చేసి లాభాలు వస్తే చేసిన అప్పులు తీర్చవచ్చని కోటి ఆశలతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం జీలుగు విత్తనాలను మాత్రమే సరఫరా చేస్తుంది. ఖరీఫ్ సీజన్ ప్రస్తుతం ఆశాజనకంగా లేకపోవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అంతే కాకుండా వ్యవసాయం సాగు చేయడానికి పెట్టుబడులు కూడా భారీగా పెరగడంతో రైతన్నలు అప్పులలో కూరుకుపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఏది ఏమైనా వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిస్తే తప్ప ఖరీఫ్ సీజన్ గట్టెక్కే పరిస్థితులు కానరావడం లేదు.

ప్రజాసంక్షేమం ఎర్ర జెండాతోనే

విశాలాంధ్ర-డోన్ : దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సకాలంలో అందాలంటే ఎర్రజెండా అవసరం ఉందని అందరూ గుర్తుంచుకోవాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు స్పష్టం చేశారు. ఆదివారం దొరపల్లె గ్రామంలో సచివాలయం నుండి రైల్వే గేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం సీపీఐ దొరపల్లె శాఖ కార్యదర్శి కొండయ్య అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగ నాయుడు మాట్లాడుతూ డోన్ పట్టణానికి సమీపంలో ఉన్న దొర పల్లె గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని... కనీసం నేషనల్ హైవే నుంచి అండర్ పాస్ రోడ్డు వేయలేని పరిస్థితిలో గత పాలకులు ప్రస్తుత పాలకులు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. అనేకమంది రోడ్డు క్రాస్ చేస్తూ ఆక్సిడెంట్లకు గురవుతుంటే గతంలో మాజీ మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేస్తామని కాలయాపన చేశారు. తప్ప రోడ్డు ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సచివాలయం పక్కన ఉన్న చదువుల రామయ్య కాలనీకి డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు వేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామంలో కాలువలు రోడ్లు నిర్మించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయం మండల కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ప్రజలకి కనీసం అవసరాలు తీర్చడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు పాలకులు ప్రజల ను నిర్లక్ష్యం చేస్తే ఎర్రజెండా వారికి అండగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య,కె. రాధాకృష్ణ డోన్ మండల కార్యదర్శి బి. నారాయణ, పట్టణ కార్యదర్శి మోటరాముడు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసు, శివయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు లక్ష్మీనారాయణ, పులి శేఖర్, డోన్ పట్టణ సహాయ కార్యదర్శి ఎన్. కె రామమోహన్, నాయకుడు కోయిలకొండ నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య డోన్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి, అమృత రెడ్డి, మాధవి, ఏఐటీయూసీ డోన్ కార్యదర్శి అబ్బాస్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి విజయుడు, పార్టీ శాఖ కార్యదర్శులు బాల మద్దయ్య, పార్టీ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూములు అక్రమిస్తే కబర్దార్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కానివ్వనని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు కబ్జాదారులను ఘాటుగా హెచ్చరించారు. ప్రథమనంది దేవాలయం భూముల నుంచి అనుమతులు లేకుండా కొందరు రస్తా నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆదివారం ఉదయం ప్రథమనంది దేవాలయం వద్దకు వెళ్లి ఈఓ రామానుజంతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అంతకు ముందు దేవాలయంలో పరమశివుడికి అభిషేకం చేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో దేవాలయాలకు సంబంధించిన భూములు కోట్లు విలువచేస్తాయని, నంద్యాల జిల్లా కావడంతో కబ్జాదారుల కన్ను దేవాలయాల భూములపై పడిందన్నారు. నంద్యాల జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కానివ్వనని, కబ్జాదారులకు తనదైన శైలిలో ఘాటుగా హెచ్చరించారు. దేవాలయం చుట్టూ రక్షణ గోడ నిర్మాణ పనులు జరిగే విధంగా ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ, బిజెపి పెద్దల దృష్టికి తీసుకొని వెళ్ళి రక్షణగోడ నిర్మించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

పట్టణ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: నంద్యాలలో జూలై 8న నిర్వహించే సీపీఐ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సీపీఐ చాంద్ బాడ శాఖ మహాసభ సీపీఐ శాఖ కార్యదర్శి ఎం హబీబ్ బేగ్ అధ్యక్షతన సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్, ఏఐటియుసి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివా సులు, డి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ పాల్గొన్నారు. సీనియర్ కామ్రేడ్ హబీబ్ బేగ్ పతావిష్కరణ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో 9 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. శాఖ కార్యదర్శిగా ఎం హబీబ్ బేగ్, సహాయ కార్యదర్శులుగా ఎస్ షేక్షావలి, ఎస్ మహబూబ్ బాషా లను ఎన్నుకున్నారు.

జాతీయ రాష్ట్రస్థాయిలో రాణించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: జాతీయ రాష్ట్రస్థాయిలో కరాటే పోటీల్లో రాణించాలని, విద్యతో పాటు ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో అవసర మని పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో బీసీ రాజారెడ్డి చేతుల మీదుగా సమ్మర్ కరాటే క్యాంపు పూర్తి చేసుకున్న సందర్భంగా కరాటే క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు.రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని, విద్యార్థులలో కరాటే మాస్టర్లను బీసీ రాజారెడ్డి అభినందించారు. కరాటే మాస్టర్లు భాష, ఫిదా, ఫిరోజ్, జిహాలు బిసి రాజారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ



విశాలాంధ్ర - మహానంది : రాష్ట్రంలో, దేశంలో ప్రజా సమస్యలపై, ప్రభుత్వాలపై పోరాడే పార్టీ సిపిఐ పార్టీ అని, ప్రతి మూడేళ్లకి పార్టీ నిర్మాణంపై జరిగే మహానంది మండల మహాసభలు జూలై 9వ తేదీ బుక్కాపురం గ్రామంలో జరుగునున్నయని, వాటిని జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఆర్.సామెల్ తెలిపారు. సిపిఐ మండల మహాసభల కరపత్రాన్ని మహానందిలో విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు, మహానంది గ్రామశాఖ కార్యదర్శి శ్రీనివాసులు, అబ్బిపురం శాఖ కార్యదర్శి లక్ష్మయ్య, సిపిఐ నాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

అంగన్వాడి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-అవుకు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి అని బనగానపల్లి సిడిపిఓ ఉమామహేశ్వరమ్మ ఓ ప్రకటనలో ఆదివారం అన్నారు. మండలంలోని పిక్కిళ్లపల్లి తాండ అంగన్వాడీ కార్యకర్తకు ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.ఆయా పోస్టులకు సంబంధించి కొండమనాయుని పల్లి ఓసి జనరల్, చెన్నంపల్లి 2కు బిసి బికి సంబంధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

అడవి పందిని చంపిన కేసులో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని కేపీ.తండా సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో అడవి పందిని వేటాడి చంపిన కేసులో మూడే బాలునాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని అటవీశాఖ అధికారి రామకృష్ణ ఆదివారం తెలిపారు. స్థానిక ఆటవీ శాఖ కార్యాలయంలో పట్టుబడిన నిందితుడు, చనిపోయిన అడవి పందిని తీసుకొచ్చి విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ కేపీ తండా సమీపంలోని నల్లమలలో బాలునాయక్ అనే వ్యక్తి అడవి పందిని వేటాడి చంపి మాంసం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడన్న సమాచారంతో దాడులు నిర్వహించి నిందితుడిని, అతడి వద్దనున్న మూడు మచ్చుకత్తులు. చనిపోయిన పందిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితున్ని అరెస్టు చేసి చనిపోయిన పంది కలేబరాన్ని పశు వైద్యాధికారిచే పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేంజర్ ముర్తుజావలి ఆధ్వర్యం లో సాంబార్ బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ల సమక్షంలో దహనం చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు సుభాష్,మదన్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

యువకుడు దారుణ హత్య..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టణ శివార్లలో దేవనగర్ కు చెందిన యువకుడు వినయ్ దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ జరిగింది. వినయ్ అనే యువకుడ్ని కత్తులతో పొడిచి కొందరు యువకులు చంపారు. మృతుడు వినయ్ గంజాయి కేసులో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ తండ్రి మాట్లాడుతూ తన కొడుకు ఇంటి దగ్గర ఉంటే స్నేహితులు తీసుకెళ్లారని తర్వాత నాకు ఫోన్ చేసి నీ కొడుకును ఎవరో కత్తులతో పొడిచారని సమాచారం ఇవ్వడంతో అక్కడికెళ్లడం జరిగిందని తెలిపారు. పోలీసులు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాలూకా సిఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ స్నేహితుల మధ్య డబ్బు విషయంలో ఘర్షణ జరిగిందని, 35 వేల రూపాయలు ఇవ్వాలంటూ స్నేహితులు గొడవపడ్డారని, ఈ గొడవల్లో వినయ్ ను కత్తులతో పొడిచి చంపడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డారని, సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొలిమిగుండ్ల సొసైటీ చైర్మన్‌గా వివేక్..!

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయపల్లి గ్రామ యువనేత అంబటి వివేకానంద రెడ్డిని కొలిమిగుండ్ల ప్రాథమిక వ్యవ సాయ పరస్పర సహకార సంఘం చైర్మన్‌గా ప్రభుత్వం నియమించినట్లు జోరుగా ప్రచారం సాగుతున్నది. నేడు రేపో అధికారికంగా ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తుంది. గతంలో ఇదే కుటుంబంలో అంబటి అంకిరెడ్డి మండల పరిషత్ అధ్యక్షులుగా పదవి చేపట్టి ప్రజలకు విశేష సేవలు అందించి తనదైన గుర్తింపు పొందారు. ఆయన మనవడిగా టిడిపి నాయకులు జయలక్ష్మి రెడ్డి కుమారుడు యువనేత వివేకానంద రెడ్డికి సొసైటీ చైర్మన్ పదవి వరించింది. ఆ కుటుంబానికి మండల స్థాయిలో సౌమ్యులుగా మంచి గుర్తింపు ఉంది. చింతలాయపల్లి చుట్టుపక్కల గ్రామాలలో రాజకీయ నాయకులుగా పట్టు కలిగి ఉన్నారు. రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మరోసారి ఆ కుటుంబానికి ప్రాధాన్యత కలిగిన పదవి ఇచ్చి ప్రాధా న్యతను కల్పించారు. మంత్రి బిసి రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి వివేకానంద రెడ్డి కుటుంబం వెన్నంటి నడిచింది. ఇదే గ్రామానికి చెందిన అంబటి సరస్వతి వ్యవసాయ పరపతి సంఘం చైర్ పర్సన్ గా ఇటీవల వరకు కొనసాగగా అదే పదవి అదే గ్రామానికి వరించడం విశేషం. చైర్మన్ గా అంబటి వివేకానంద రెడ్డి, సభ్యులుగా పి సత్యనారాయణ రెడ్డి, కే వెంకట శివారెడ్డిలను నియామకం జరిగినట్టు ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే మండలంలోని హనుమంతు గుండం ప్రాథమిక వ్యవసాయ పరస్పర పరపతి సంఘం చైర్మన్ గా కోటపాడు గ్రామానికి చెందిన మూల శివారెడ్డి, సభ్యులుగా ఎన్ దస్తగిరయ్య, రాందాసులను నియమించినట్లు ప్రచారం జరుగుతున్నది. వీరి నియామకం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండల మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: జూలై 14వ తేదీన జరిగే సిపిఐ గోస్పాడు మండల మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ గోస్పాడు మండల నాయకులు పిలుపునిచ్చారు. గోస్పాడు మండల కేంద్రంలో మండల సహాయ కార్యదర్శి షేక్ జిలాని భాషా అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్ గోస్పాడు శాఖ కార్యదర్శి షేక్ మౌలా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు గోకారి .రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడు తూ నిరంతరం సామాన్య మధ్యతరగతి కార్మికుల కర్షకుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బోధనం పాపన్న, యూనిస్, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఎల్ఈడి వెలుగులు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని నల్లమల అడవి సమీప పల్లెల్లో ఎల్ఈడి విద్యుత్ బల్బులు అమర్చి ప్రతి వీధిలో చివరి గడప వరకు విద్యుత్ వెలుగులు నింపేలా తగిన చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ పెద్ది రమణయ్య పేర్కొన్నారు.మహాదేవ పురం,పచ్చర్ల,తదితర గ్రామాలలో స్ట్రీట్ లైట్స్ మరమ్మత్తు పనులను ఆదివారం ముమ్మరంగా చేపించారు. గ్రామపంచాయతీ లోని పలు వార్డు వీధులలో విద్యుత్ బల్బులు, కేబుల్ తదితర మరమ్మత్తు సమస్యలు అమర్చమన్నారు. గ్రామపంచాయతీ నిధులు రావడానికి ఆలస్యం అయినప్పటికీ సొంత నిధులతో గ్రామ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్ది రమణయ్య మాట్లాడుతూ గ్రామంలోని ప్రతివాడ ప్రతి వీధిలో చివరి గడప వరకు ఎల్ఈడి బల్బులు వెలుగులు విరజిమ్మేళ తక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: టీడీపీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తించి న్యాయం చేస్తుందని నంద్యాల నీటి సంఘం ఛైర్మన్ చాబోలు ఇలియాస్ అన్నారు. ఆదివారం మండల సంస్థాగత ఎన్నికల సమావేశం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి నీటి సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు మండల పరిశీలకులుగా చాబోలు ఇలియాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చోబోలు ఇలియాస్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని, కక్షపూరిత రాజకీయం వల్ల రాష్ట్ర అభివృద్ధి తలకిందులైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం లక్షలాది తెలుగుదేశం కార్యకర్తల శ్రమకు ఫలితమని పేర్కొన్నారు. మండల అధ్యక్షులు రవీంద్ర, టౌన్ అధ్యక్షులు వేణుగోపాల్, మైనారిటీ నాయకులు నూర్ బేగ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నేడు సోమవారం ఉదయం 9.30 గంటలకు నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకు మారి గణియా ఆదివారం తెలిపారు. ఉదయం 9-30 గంటలకు అధికారులందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నూతన రేషన్ షాప్ ప్రారంభం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని నూతన రేషన్ షాపును తాలుకా టిడిపి సీనియర్ నాయకులు భార్గవరామ్ ఆదివారం ప్రారంభించారు. ఆళ్లగడ్డ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు శివచరణ్ ఎలిమెంటరీ స్కూల్ సమీపాన ఏర్పాటు చేసిన రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా భార్గవ రామ్ మాట్లాడుతూ రేషన్ షాప్ లో ప్రజలకు ఒకటవ తేదీ నుండి 15వ తేదీ లోపల రేషన్ అందజేయాలన్నారు. రేషన్ దుకాణాల్లో పాత వ్యవస్థను కొనసాగించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవి శెట్టి హరీష్ బాబు, శబరిష్ ప్రసాద్, విజయ్, శీను, టిడిపి నాయకులు చింతకుంట రామశేఖర్ రెడ్డి, నక్కలదిన్నె శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, డీలర్లు ప్రసాద్, ముజీద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై వెంకటసుబ్బయ్య సేవలు అమోఘం



విశాలాంధ్ర - బనగానపల్లె: ఎస్సై వెంకటసుబ్బయ్య సేవలు అమోఘమని అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఎస్సై సుబ్బయ్య పదవి విరమణ కార్యక్రమాన్ని సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐలు ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సై సుబ్బయ్య సేవలు అమోఘమని కంప్యూటర్ వర్క్ చాలా ఫాస్ట్ గా నిర్వహించేవాడని గుర్తు చేశారు. విధుల పట్ల అంకిత భావంతో పనిచేసేవాడని పేర్కొన్నారు. అనంతరం ఎస్ఐ సుబ్బయ్య దంపతులను అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్, రూలర్ సీఐ మంజునాథ్ రెడ్డి, బనగానపల్లె ఎస్సై దుగ్గిరెడ్డి, అవుకు ఎస్సై పోలీస్ సిబ్బంది గజమాలవేసి ఘనంగా సన్మానించారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలో ప్రభుత్వ ఎస్సి హాస్టల్‌లో ఆదివారం విద్యార్థులు సమావేశాన్ని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు జాయింట్ సెక్రటరీ చందు మాట్లా డుతూ కోయిలకుంట్లలోని ప్రభుత్వ హాస్టల్లో సమస్యలకు నిలయంగా మారిందని ఆవేద వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం చికెను, కోడిగుడ్లు,అరటిపండ్లు ఇవ్వడం లేదని, బాత్రూం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉన్న బాత్రూంలోకి డోర్లు కూడా లేవని,పాడుబడిన భవన్‌లో విద్యార్థులు ఉంటున్నారని వెంటనే అధికారులు స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో విద్యార్థులు కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 30, జూన్ 2025

మౌలిక సదుపాయాలు కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర : కర్నూలు : కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమైనారని సీపీఐ నాయకులు విమర్శించారు. ఆదివారం నగరంలో వివిధ ప్రాంతాల్లో సిపిఐ శాఖ మహాసభలు సమావేశాలు జరిగాయి ఈ సమావేశానికి నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు కాలనీలోని ఆటో స్టాండ్ దగ్గర పార్టీ (సిపిఐ)జెండా ఆవిష్కరణ చేసి అక్కడినుండి మద్దిడి స్వామి గుడి వరకు ర్యాలీగా పోయి అక్కడ బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు దాసరి మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశము నుద్దేశించి శ్రీనివాసరావు, సి.మహేష్‌లు ప్రసంగిస్తూ కార్మిక కర్షక కష్టజీవుల సమస్యలపై సిపిఐ నిత్యం పోరాటాలు చేస్తుంది అన్నారు. పాలకులు ఎన్నికలకు ముందు అనేక రకాలైన సంక్షేమాన్ని అభివృద్ధిని అమలు చేస్తామని నమ్మబలికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముంచి ఒదన్నారు. టీవీ9 ప్రజా నగర్‌లి శాఖ కార్యదర్శిగా ఇమాంబి ,సహాయ కార్యదర్శిగా దాసరి మహేష్, బి మధు, కమిటీ సభ్యులుగా ఎర్ర లక్ష్మి, పద్మమ్మ ,బి రాము, మంజుల, అంజి, అబ్దుల్ ,కరీం ,నౌషద్ బి షా ఎన్నుకున్నారు. లిఇందిరమ్మ కాలనీలి (నట్టు) శాఖ కార్యదర్శిగా ఖాజా ముని సహాయ కార్యదర్శిగా కాజా భాష 9మంది కమిటీ మెంబర్లుగాళీ ఎన్నుకోని మరియు లికుమ్మరి వీధిలి తశాఖ నుండి దేవి భాయ్ శాఖ కార్యదర్శిగా ఈరన్న సహాయ కార్యదర్శిగా 11మంది కమిటీ మెంబర్లు ఎన్నుకోని మరియు లిగని గల్లిలి నుంచి శాఖ కార్యదర్శిగా ఖాజాబీసహాయ కార్యదర్శిగా జరీనా ఖాతూ 9మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు నల్లన్న, ఈశ్వర్ ,బీసన్న, సోమన్న ,ఇంటి స్థలాల బాధితుల కర్నూలు నగర కన్వీనర్ రామంజి గౌడ్ పాల్గొన్నారు

సమ సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు మండలాల 11వ సిపిఐ మహాసభలు అత్యంత ఉత్సాహభరితంగా వందలాది మంది ఎర్రజెండాలు పట్టుకొని, డప్పుల నృత్యాలు చేస్తూ, స్వతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు మతసామరస్య సామర శతకం సూచికగా హిందూ ముస్లిం క్రిస్టియన్‌ల వేషధారణలతో స్థానిక జూనియర్ కళాశాల నుండి సోమప్ప సర్కిల్ మీదుగా కుర్ని కళ్యాణమండపం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం కూర్మి కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు మండల సహాయ కార్యదర్శి రాజీవ్ అధ్యక్షతన ప్రతి నిధుల జరిగింది ఈ సందర్భంగా సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు మండల కార్యదర్శి సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు చిన్నన్న జెండా ఆవిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ మహా సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య ,సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 11ఏళ్ల పరిపాలనలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని సీస్ బ్యాంకులో ఉన్నటువంటి భారతీయ ధనవంతుల నల్లధనాన్ని బయటకు తీసుకొచ్చి ప్రజల పరుస్తామని రైతాంగ ఆత్మహత్యలు నాపుతా మని చెప్పి అధికారంలోకి వచ్చి వాటిని పట్టించుకోకుండా దేశంలో మతం పేరుతో కులాల మధ్య ప్రాంతాల మధ్య చిచ్చు రేపుతో మతసామరస్యానికి ప్రాతిపదిక అయినటు వంటి భారతదేశంలో లౌకిక తత్వానికి తూట్లు పడుతుందని వారు విమర్శించారు. ఈ దేశం అభివృద్ధి కావాలంటే వ్యవసాయం లాభసాటి కావాలని అది నెరవేరాలంటే స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని రైతుల అప్పులను రద్దు చేయాలని రైతులు పండించిన పంటకు కనీస మద్దతు చట్టం తీసుకురావాలని అప్పుడే రైతులు ఆత్మహత్యలు ఆగుతాయని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా అనేక వాగ్దానాలు చేసి గెలిచిన తర్వాత వాటిని నెరవేర్చడంలో విఫలం చెందారని వారు విమర్శించారు. ఉట్టికెక్క లేనమ్మ స్వర్గానికి ఎక్కినట్టు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అందరినీవా గాలేరు నగరి వేదవతి గుండ్రేవుల ప్రతిపాదిత ప్రాజెక్టులను పూర్తి చేయకుండా గోదావరి నది జలాలకు బనక చర్ల ప్రాజెక్టుని రూ.82వేల కోట్లతో నిర్మిస్తా నని చెప్పడం ఎంతవరకు సమంజసం అని వారు విమర్శించారు. ఈ మహాసభల్లో ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి జి.రంగన్న, పంపన్న గౌడ్, భాస్కర్ యాదవ్, విరుపాక్షి, కెసి జబ్బర్, దాదావాలి, బజారి, తిమ్మాపురం సిపిఐ సర్పంచ్ మహేశ్వరమ్మ, నాగన్న ఏఐటియుసి నియోజకవర్గ నాయకులు వీరేష్ విజయేంద్ర,తిమ్మ గురుడు, గిడ్డయ్య, నాగప్ప,విరుపాక్షి నాయుడు వెంకటేష్ మహిళా సమైక్య నాయకురాలు ఈరమ్మ, వాణి, బజారి మల్లికార్జున గౌడ్ , మద్దిలేటి నాయుడు,లక్ష్మిరెడ్డి తదితరులు నాయకత్వం వహించారు.

ఆయనో మంచి మాస్టారు...!

- విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన కృషీ వలుడు
- జిల్లా రాష్ట్ర అవార్డులు సొంతం

- " కోడుమూరు ఎంఈవో-2 తైమూర్ భాషపై ప్రత్యేక కథనం..!"

ఆయనో మంచి మాస్టారు.. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మహోన్నతుడు. ఎంతో మంది విద్యా కుసుమాలను సమాజానికి అందించిన దిక్సూచి.. సైన్స్ పరిశోధనల్లో ఔరా అనిపించునేలా ప్రతిభ చాటారు. జిల్లా విద్యాశాఖ రూపొందించిన ఇంగ్లీష్ సబ్జెక్టు స్టడీ మెటీరియల్ రూపకల్పనలో అతని భాగస్వామ్యం ఉందంటే ఎంతటి మేధావో అర్థం చేసుకోవచ్చు.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులు అందుబాటులోకి తెచ్చి ఘనత ఆయనకే సొంతం.. కర్నూలు జిల్లాలోని కోడుమూరు జివిఆర్ జెడ్పీహెచ్ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న తైమూర్ బాష సేవలు అనిర్వచనీయం...

విశాలాంధ్ర – కోడుమూరు : జిల్లాలోని ఓర్వకల్లు మండలం, లొద్దిపల్లె గ్రామంలోని ఫాతిమాబి, సిలార్ సాహెబ్ దంపతులకు 1963లో 7వ నెల ఒకటవ తేదీన రెండవ సంతానంగా బట్టి తైమూర్ భాష ఓ పేద కుటుంబంలో జన్మించిన ఆయన కృషితో నాస్తి దుర్భిక్షం అనే నాడుడిని సాఫల్యం చేశాడు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత.. పలు రంగాల్లో తనదైన శైలితో జిల్లా రాష్ట్ర స్థాయిలో ఎన్నోరకాల అవార్డులను సాధించి, నిబద్ధతతో వృత్తి పట్ల నిరంతర బోధకుడుగా.. పాఠశాలల రూపురేఖలను మార్చి సహచర ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచిన కృషీవలుడు.. నేడు పదవీ విరమణ పొందుతున్న బట్టి తైమూర్ భాష ఉద్యోగ ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

జిల్లా స్థాయిలో అవార్డులు ఎన్నో: తైమూర్ భాష పాఠశాలల ఖ్యాతిని తారస్థాయికి చేర్చడంలో ఆయనకు ఆయనే సాటి. 1997-98లో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులచే ఎన్నో అవార్డు అందుకున్నారు. 1999-2000 మధ్యలో పర్ల హైస్కూల్లో పనిచేస్తూ జిల్లా సైన్స్ ఫెయిర్‌లో జిల్లాలో ప్రథమ బహుమతి సాధించి, ఉమ్మడి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 2009లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే అవార్డు తీసుకున్నారు. 2014లో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత పెంపొందించేందుకుగాను జిల్లా విద్యాశాఖ రూపొందించిన ఇంగ్లీష్ సబ్జెక్టు స్టడీ మెటీరియల్ రూపకల్పనలో భాగస్వామ్యం వహించి, రాష్ట్ర ప్రభుత్వంతో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

గురువులకే ఆయన గురువు : 5 నుంచి 7వ తరగతి విద్యార్థుల కోసం నిర్మింపబడిన మన నీరు పార్ట్-2 పుస్తకం-పర్యావరణ విద్య ప్రాజెక్టులో భాగస్వామ్యుడై ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్‌గా జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో పది ఏళ్ల పాటు ఉపాధ్యాయులకే గురువుగా కొనసాగారు. అలాగే ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ పర్యావరణ విద్యపై ఐదు ఏళ్ల పాటు మాస్టర్ ట్రైనర్‌గా పనిచేశారు. ఆత్మకూరు తాలూకా స్థాయిలో ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లోని ఉపాధ్యాయులకు పర్యావరణ పరిరక్షణ- పర్యావరణ విద్యపై అవగాహన సదస్సులు నిర్వహించారు. నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలులో భాగంగా జిల్లా అంతటా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యాలయమే ఆలయం : తైమూర్ భాష గురువంటే జ్ఞానాన్నివ్వడమే కాదు, విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవడం కూడా ఉపాధ్యాయుల బాధ్యత అంటుంటారు తైమూర్ భాష, పాఠశాల విధులకు సమయానికి హాజరవడం కాదు, తన పరిధిని మించి బడి అభివృద్ధికి పాటుపడటం కూడా ఉపాధ్యాయుడి విధులేనని ఆయన భావన. ఉద్యోగం అంటే ఓ బాధ్యతే కాదు.. సమాజానికి, అభాగ్యులకు చేతనైన సాయం చేయడం అంటారు ఆయన..

పాఠశాలల అభివృద్ధికి కృషి : 2020లో నందికొట్కూరు నియోజకవర్గస్థాయి నాడు-నేడు ప్రోగ్రాం అధికారిగా పాఠశాలలో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ నిజాయితీగా సేవలు అందించారు. అలాగే ఉమ్మడి జిల్లాలో నాడు-నేడు పనులకు జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్ టీంలో పర్యవేక్షణ అధికారిగా పాఠశాలల్లో మెటీరియల్ పనులను మానిటరింగ్ చేశారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రోగ్రాం పైన జిల్లా కోశాధికారిగా 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు సేవలు కొనసాగించారు. పీఎం శ్రీ కింద దాదాపు 3 కోట్ల నిధులతో ప్రాతకోట హైస్కూల్లో అభివృద్ధి పనులను పూర్తి చేసిన ఘనత ఆయనకే దక్కింది. జిల్లా పరిషత్ హై స్కూల్ పిఎమ్ శ్రీ కింద ఎంపిక కావడానికి ప్రధాన భూమిక పోషించారు. జివిఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఒకేషనల్ కోర్సులు భాగంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ బ్యాంకింగ్ ఎలక్ట్రికల్స్ తదితర విభాగాల్లో ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులు తీసుకొచ్చి పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సేవలందించారు. కోడుమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో హెడ్మాస్టర్ గా విధులు నిర్వహిస్తూనే, ఎంఈఓ-2 గా అదనపు బాధ్యతలు స్వీకరించి అంగన్వాడి టీచర్లకు శిక్షణ, సిసిహెచ్‌లకు శిక్షణ,యోగాంధ్ర వంటి తదితర సామాజిక ప్రోగ్రాంలను విజయవంతంగా నిర్వహించారు. కోడుమూరు జివిఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రీన్ ఇన్ ఫ్రా విండ్ సొల్యూషన్ లిమిటెడ్ వారిచే 10కిలో వాట్స్ కెపాసిటీ గల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సెంకార్ప్ సైట్ ఇంజనీర్ సి మణికందన్ చేతులమీదుగా ప్రారంభింపజేసి పాఠశాలల అభివృద్ధి పట్ల నిగర్వంగా తనకున్న నిబద్ధతను ఆయన చాటిచెప్పారు.

ఆయన ప్రస్థానం... స్వగ్రామంలోని పాఠశాలల్లోనే 1నుంచి 10వతరగతి వరకు విద్యాబుద్దులు నేర్చుకున్నారు. కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో ఇంటర్,డిగ్రీ చదువులను పూర్తిచేశాడు. విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని నిబద్ధత కలిగిన యువకుడిగా పేరుతెచ్చుకున్నాడు. 1984లో గుల్బర్గా యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేశాడు. అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీలో ఎంఏ పుట్టభద్రుడైయ్యారు. ఇంతటితో ఆగకుండా అన్నమలై డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అకాడమీలో ఎంఈడి కూడా పూర్తి చేసి 1985డీఎస్సీలో తొలి పోస్టింగ్ ఓర్వకల్లు మండలంలోని గుడుంబా తాండ గ్రామంలో స్పెషల్ టీచర్‌గా ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిత్తశుద్ధితో పాఠాలు బోధించి ఎంతోమందికి మార్గదర్శకం వహించారు.

సొంత ఊర్లోనే పోస్టింగ్ : ముఖ్యంగా 2005 మేలో ఆత్మకూరు హైస్కూల్లో పనిచేస్తూ కన్వర్షన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ టీచర్‌గా తన స్వగ్రామమైన లొద్దిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు. అక్కడ 2013వరకు బాల్య దశలో తాను చదువుకున్న సొంత ఊళ్ళో 8ఏళ్లపాటు విధులు నిర్వహించి, కర్నూలులోని హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. 2024 అక్టోబర్‌లో ఎఫ్ఎసి కింద కోడుమూరు ఎంఈవో-2 నేటి వరకు విధులు నిర్వహిస్తూ తైమూర్ భాష పదవీ విరమణ పొందుతున్నాడు.

ఆహ్వాన సంఘం సమావేశాన్ని జయప్రదం చేయండి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : సీపీఐ జిల్లా 24 వ మహాసభలు 2025 జూలై 28 29 30 తేదీల్లో కర్నూల్ నగరంలో నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభల విజయవంతం కోసం జులై 2వ తేదీన గురువారం కర్నూల్ నగరంలోని సిఆర్ భవన్ నందు ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశంలో సిపిఐ శ్రేయోభిలాషులు సానుభూతిపరులు సిపిఐ ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నాడు కర్నూలు నగరంలో సీఆర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 2025 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని ఈ 100 సంవత్సరాలలో భారతదేశంలో మొట్టమొదట భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తీర్మానం చేసిన మొట్టమొదటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశాడు ఈ వంద సంవత్సరాలు అనేక భూ పోరాటాలు చేసి పేద ప్రజలకు, వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ కు ఉంది అన్నారు. నేడు పేద ప్రజలకు అనుకూలమైన అనేక చట్టాల కోసం పోరాటం చేసిందని ఆయన కొనియాడారు ముఖ్యంగా కర్నూలు జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయలకు, ముఠా రాజకీయాలకి భూస్వాములకు, వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపి నిరంతరం పేదల పక్షాన ఉద్యమాల కొనసాగిస్తున్న సిపిఐ కర్నూలు జిల్లా 24 వ మహాసభలు జులై 28 29 30 తేదీల్లో నిర్వహించడం కోసం వాటి విజయవంతం కోసం జులై 2 బుధవారం నాడు ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వర్షం కోసం ఎదురుచూపులు

- వర్షాభావంతో ఇప్పటికే వేసిన విత్తనంతో రైతులు ఇబ్బందులు
- మరో నాలుగు రోజులు దాటితే మరోసారి విత్తుకోవాల్సిందే
- వాతావరణ వింత పరిస్థితి తో నష్టపోతున్న రైతన్నలు
- అరుతడి పంటలతో ఆందోళన

విశాలాంధ్ర – ఆలూరు : ఆలూరు మండల రైతులు వర్షం కోసం ఎదురుచూడవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో వేల ఎకరాల్లో వర్షాలపైనే సాగు పనులు ఆధారపడ్డాయి. మృగశీర కార్తె వచ్చి పదిరోజులు అవుతున్న మండల కేంద్రంతోతో పాటు ఆయా గ్రామల్లో చాలా వరకు తగినత వర్షాలు పడలేదు. పడిన అరకోరా వర్షాలకు చాలా మంది రైతులు పొలాల్లో విత్తనం వేయసాగారు. చాలా చోట్ల సాధారణ వర్షపాతం కన్న తక్కువగా పడటంతో ఆయా గ్రామాల్లో రైతులు వేరుశనగ, పత్తి, కంది, తదితర పంటలను వేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగు రోజులు ఇదే వర్షభావం కొనసాగితే విత్తనాలు మొలవకపోవడం, మొలకెత్తిన పైరు ఎండిపోవడం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. మరో వైపు దుక్కులు రెడీ చేసుకున్న రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుస్తున్నారు. వాతావరణంలో వింత పరిస్థితిలో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల' స్వీకరణ

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు https://Meekosam.ap.gov.in నందు చూడవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

థైక్వాండోలో రాణించాలి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్ : క్రమశిక్షణకు మారుపేరు తైక్వాండో అలాంటి క్రీడల్లో విద్యార్థులు రాణించాలని సెపక్తక్రా రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. కృష్ణానగర్‌లో ఆదివారం జరిగిన తైక్వాండో బెల్ట్ టెస్ట్ పరీక్ష ప్రారంభ కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొని ప్రతిభావంతులకు ఆరెంజ్, ఎల్లో, గ్రీన్, బ్లాక్ బెల్ట్ లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షకులు నేర్పే మెలుకువలు నేర్చుకొని బెల్ట్ టెస్టులకే పరిమితం కాకుండా రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని అవకాశాన్ని సంపాదించాలని ఆయన తెలియజేశారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించే వారికి రానున్న రోజుల్లో మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తద్వారా క్రీడాకోటలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో విరామ ఉద్యోగి మల్లికార్జున, తైక్వాండో శిక్షకులు రాంబాబు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కోల్‌కతాలోలా కాలేజీ స్టూడెంట్‌పై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు ఎన్.కృష్ణయ్య ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో సభ్య సమాజం తలదించుకునే విధంగా కోల్‌కతా లా కాలేజీ స్టూడెంట్‌పై అదే కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సామూహిక అత్యాచారానికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమ, మంగళ వారంలలో ఐఏఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజల పక్షాన నిలబడే పార్టీ ఎర్రజెండా

విశాలాంధ్ర – ఆదోని రూరల్: కార్మికులు, కర్షకులు, కష్టజీవుల పక్షాన ఉండే పార్టీ ఎర్రజెండా ఒక్కటేనని సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అన్నారు. ఆదివారం మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో సిపిఐ శాఖ కార్యదర్శి ఉరుకుందు అధ్యక్షతన జరిగిన సిపిఐ జెండా పతాక ఆవిష్కరణ గ్రామ సీనియర్ నాయకులు నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ మండల కార్యదర్శి కల్లుబావి రాజు పాల్గొని మాట్లాడారు. కార్మిక కష్టజీవుల హక్కులకై పోరాడుతున్న జెండా ఎర్రజెండా అని ఉడతడుకులు ఎదురైనా పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కొత్తూరు గంగన్న, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, గ్రామస్థాయి నాయకులు, ఈరన్న గౌడ్,సురేష్,ముని, నరసింహులు,ఉరుకుందు, లేపన్న,సుంకప్ప,వీరేష్,ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా షరీఫ్

విశాలాంధ్ర – నందవరం : పూలచింత గ్రామం టిడిపి అధ్యక్షుడిగా షరీఫ్ ఎంపికయ్యారు. శుక్రవారం ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి గ్రామ కమిటీలను ఎన్ను కున్నారు. అందులో భాగంగా పూలచింత టిడిపి సీనియర్ నాయకులు బండే గురు స్వామి ప్రతిపాదనతో ఎమ్మెల్యే బీవీ గ్రామ అధ్యక్షుడిగా షరీఫ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే బివిని పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఎమ్మెల్యే బివి, బండే గురుస్వామిలు అధ్యక్షులు ఎన్నుకోవడం జరిగిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామంలోని టిడిపి కార్యకర్తలందరిని కలుపుకుని, తెలుగుదేశం పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ డొనేషన్ల పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తల్లి తండ్రులు డిమాండ్
- తనిఖీలు మరిచిన విద్యాశాఖ అధికారులు
- ఆలూరులో విద్యాసంస్థల ఇష్టరాజ్యం..

విశాలాంధ్ర-ఆలూరు : రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాల్లో గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం విద్యను ను ప్రవేశపెట్టింది. కానీ గత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ఎలా ఉన్న. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్లో ఆయా యాజమాన్యాలు అడిదే అట..పాడిందే పాటగా మారింది. ఆయా ప్రయివేట్ పాఠశాల్లో అధిక ఫీజుల దోపిడితో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తల్లి తండ్రులు వాపోతున్నారు. ఈ తాతంగం వెనుకబడిన నియోజకవర్గంలోని ఆలూరు మండలంలో పలు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో జరుగుటుండటం కోసమేరుపు. ఇటు విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఆలూరు నియోజక వర్గ కేంద్రం కలకాలం రేగుతోంది వివరాల్లోకి వెళితే... ఆలూరు మండల కేంద్రములో దాదాపుగా 9దాకా ప్రైవేట్ రెండు కార్పొరేట్ పాఠశాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థల్లో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆల్ ఫోర్స్ స్మార్ట్ స్కూబ్ అనే పేరుతో పాఠశాల ఏర్పాటు చేసి అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నాయి. ఇదే పాఠశాల్లో తమ యొక్క విద్య సంస్థ పేరుతొ మెటీరియల్‌ని అమ్ముతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను అధిక ధరలకు అమ్ముతు నిలువు దోపిడీ చేస్తున్నారని వారి తల్లితండ్రులు వాపోతున్నారు. అంతేకాకుండా మండల కేంద్రం లో ఉన్న ఒక కార్పొరేట్ స్కూల్, ఫౌండేషన్ స్కూల్ అని చెప్తూ లక్షల్లో ఫీజులు మాలు చేస్తూ ధనర్జనే ధ్యేయంగా దోచుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యా శాఖ అధికారుల అలసత్వం వల్ల యాజ మాన్యాలు ఇష్టమెచ్చినట్లు ఫీజులు పెంచుకుంటూ పోతున్నారు. పెరిగే ఫీజులతో పేద విద్యార్థులకు చదువులు అందని ద్రాక్షలా మారింది. ఫీజుల నియంత్రణపై అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో యాజమాన్యాలు, ఫీజులు తమ ఇష్టారాజ్యాంగ పెంచుకున్నారు. రకరకాల పేర్లతో పుట్టుకొస్తున్న పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్స్ మొదలు స్కూల్లో. విద్యార్థులకు అవసరమైన గుర్తింపు కోసం పాకులాడే యాజమాన్యం ఇచ్చే టైలు, బెల్టు, షూసు, బుక్స్ వరకు యాజమాన్యాలు నిర్ణయించిన అధిక ధరలకే కొనుగోలు చేయాల్సి ఉందని, విద్యార్థుల తల్లి తండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసి వారి ఆమోదంతోనే ఫీజులను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ స్కులు, ప్రయివేట్ పాఠశాల్లో జరుగుతున్నా అధిక ఫీజుల దోపిడీ పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు

షబీర్ భాష.. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మండలంలోని ప్రైవేట్, కార్పొట్ పాఠశాలలు ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తూ, ఆ పాఠశాలలో ఎక్కడ కూడా ఫీజులు పట్టికలు కనిపించలేదని, విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు వ్యవరిస్తున్నారు, ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, ఆ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాను. పాఠశాలపై చర్యలు తీసుకోకుంటే జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

ముగిసిన బదిలీల కౌన్సిలింగ్

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి పట్టణ ప్రాంతాల్లోని సచివాలయాల కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నగరపాలక సంస్థ కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధ్వర్యంలో రెండు రోజుల పాటు కౌన్సిలింగ్ నిర్వహించారు. తొలిరోజు అడ్మినిస్ట్రేటివ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, శానిటేషన్ కార్యదర్శులకు, రెండో రోజు ప్లానింగ్, అమినిటీస్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 308 సచివాలయాలు ఉండగా, శనివారం 864 మందికి, ఆదివారం ప్లానింగ్ 155, అమినిటీస్ 170 మందికి కౌన్సిల్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీల ప్రక్రియ చేపట్టామని, ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి ప్రస్తుత వార్డు, సొంత వార్డు మినహా ఇతర వార్డులను ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. అభ్యర్థనలను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, గూడూరు కమిషనర్ రమేష్ బాబు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం డైరెక్టర్ పదవికి రాజీనామా

విశాలాంధ్ర – కౌతాళం రూరల్ : నూతనంగా కౌతాళం సహకార సంఘం ఎంపికైన కురుబ వీరేష్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘం చైర్మన్‌ల ఎంపికలో కురుబలకు తెలుగుదేశం ప్రభుత్వం, మంత్రాలయం నియోజకవర్గం నాయకులు సరైన న్యాయం చేయలేదన్నారు. నాలుగు మండలాల్లో 7సహకార సంఘం చైర్మన్‌లను ఇటీవలే ఎంపిక చేయడం జరిగిందన్నారు. అయితే ఏడు స్థానాలలో ఒక్క స్థానానికి కూడా కురుబ సామాజిక వర్గానికి చెందిన వారిని ఎంపిక చేయకపోవడం విచారకరమన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో మంత్రాలయం,కోస్గి,పెద్దకడబూరు,కౌతాళంనాలుగు మండలాలలో 35 వేల ఓట్లు గల కురుబలకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా ప్రశ్నించారు. గత ప్రభుత్వం జిల్లా స్థాయిలో,రాష్ట్రస్థాయిలో సముచిత స్థానం కల్పించడం జరిగిందని అన్నారు. కురుబలకు నామినేటి పోస్టులలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే రాబోయే కాలంలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన కౌతాళం సహకార సంఘం డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం జిల్లా నియోజకవర్గం కూటమి ప్రభుత్వం నాయకులు స్పందించాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడి మృతి

విశాలాంధ్ర – ఆస్పరి : మండల పరిధిలోని నగరూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గోవిందరాజులు (60)శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతికి ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలియజేశారు. దళితుల హక్కులకై అహర్నిశల పోరాటాలు చేశారని, ఆయన సేవలు మరువలేనివని పలువురు నాయకులు గుర్తు చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం ఉదయాన్నే గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని పరామర్శించారు. గోవిందురాజులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైయస్సార్సీపీ నాయకులు పాండు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 30, జూన్ 2025

పరమేశ్వర్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : అన్ని వృత్తులలో కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అటువంటి ఉపాధ్యాయ వృత్తిలో పరమేశ్వర రెడ్డి 35 సంవత్సరాలు పనిచేసి పదవి విరమణ చెందడం గర్వకారణమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం కర్నూల్ లోని కేశవ గ్రాండ్స్ నందు ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన గోనెగండ్ల మండలం కున్నూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కే పరమేశ్వర్ రెడ్డి పదవి విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వృత్తులలో కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అటువంటి ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘకాలం పాటు సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులుగా, గణిత ఉపాధ్యాయులుగా, గ్రేటు 2 ప్రధానోపాధ్యాయులు పనిచేసే ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని అంతే కాకుండా తాను పనిచేసిన ప్రతిచోట విద్యార్థుల మనసులను చూరగొని ప్రజలతో నిరంతరం సత్సంబంధాలను కలిగి విద్యార్థులకు కావలసిన ప్రాథమిక అవసరాలను తీర్చుతూ విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఎస్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గోకారి టి.కే జనార్దన్లు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, సమయపాలన, వృతి పట్ల అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. తదనంతరం దంపతులిద్దరిని ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత కె పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో నిరంతరం సత్సంబంధాలను కలిగి ఉండాలన్నారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై నారాయణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మాజీ పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న ప్రధానోపాధ్యాయుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ మధుసూదన్ శర్మ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు బంధుమిత్రులు తదితరులు పాల్గొని విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని చింతలాయపల్లి గ్రామం ప్రధాన వీధులలో స్పెషల్,స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయం సమీపంలో గ్రామస్తులను సమావేశపరిచి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ఎలాంటి గొడవలకు దిగకుండా శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. తమ పిల్లలను బాగా చదివించుకొని అభివృద్ధి చెందాలన్నారు. కక్షలకు దూరంగా ఉండి ఐక్యంగా గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు, బెట్టింగ్,ఆన్లైన్ గేమ్ లకు యువత దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్సై గోపాల్, ఏఎస్ఐ నాయక్, పోలీసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ కరాటే క్యాంప్

విశాలాంధ్ర- బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మే 24నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన వేసవి కరాటి శిక్షణ ముగిసింది. ఆదివారం నాడు మంత్రి నివాసంలో కరాటే శిక్షకులు కరాటే విద్యార్థులు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో సతీమణి బీసీ ఇందిరా రెడ్డిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన 54 మందికి సర్టిఫికెట్ ప్రధానం చేసింది. అంతేకాకుండా ప్లాస్టిక్ మీద అవగాహన కల్పించి వారికి స్టీల్ బాటిల్, బ్యాగులను పంపిణీ చేసింది. కరాటి శిక్షకులు ఫిదా హుస్సేన్, ఫిరోజ్ బాషా, జియా అబ్బాస్ అభినందించారు. సమ్మర్ క్యాంపుకు సహకరించిన ప్రధాన ఉపాధ్యాయుడు కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల సభలలో

ఆహారం ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : దివ్యాంగులకు చేతి కర్రలు వెనికిడి యంత్రాలు బ్యాటరీ వెహికల్స్ వీల్ చైర్స్ కాళ్లు చేతులు పరికరాలను అందించేందుకు పెద్ద ఎత్తున ఏడు జిల్లాలో సభలు ఏర్పాటు చేసి దివ్యాంగులకు అవసరమైన పరికరాల నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారని అన్నారు అయితే నీరు ఆహారం నీడ కల్పించకపోవడం వల్ల దివ్యాంగులు చాలామంది నిరసించి ఉప కూలిపోతున్నారని మరియదాస్ తెలియజేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు నంద్యాల ఎంపీ గారీ ఆదేశాల మేరకు 28న నంద్యాల నందికొట్కూరులో సభలు ఏర్పాటు చేశారని దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం అప్లికేషన్ నమోదు చేయించుకోవడం కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఇబ్బందులకు గురవుతూ వచ్చిన దివ్యాంగులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కనీసం నీటి వసతి కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల సంక్షేమం కోసం సభలు ఏర్పాటు చేసినప్పుడు అభాగ్యులకు అన్నం పెట్టడం పెద్ద కష్టమేమీ కాదని గిజారి మరియదాస్ సూచించారు. జులై 1 మంగళవారం ఆళ్లగడ్డ బనగానపల్లె,డోను, పాణ్యం, నియోజకవర్గాలలో ఏర్పాటు చేసే దివ్యాంగుల సబలలో భోజన వసతి ఏర్పాటు చేయాలని వికలాంగుల ఆదరణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరియదాస్ కోరారు.

ఘనంగా మార్కెట్ యార్డు డైరెక్టర్ తులసిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆయన జన్మదినం కావడంతో అన్ని వర్గాల అభిమానులు గజమాలలు, పూలదండలు, కేకు కటింగ్, శాలువాలు కప్పుతూ మిఠాయిలు తినిపించి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సాయంత్రం భారీ గజామలతో పాటు భారీ కేకు కటింగ్ చేశారు. యువత ఆయన పుట్టినరోజు సందర్భంగా టపాసులు కాల్చుతూ అభిమానాన్ని చాటుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి వెంట వచ్చిన బంధువులు అందరికీ అన్నదానం చేశారు. ఎందరో మనసుల హృదయాలు గెలుచుకున్న ఆయన కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పురోహితులు దీవించారు.

మొక్కజొన్న పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర - పాములపాడు : ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో మే చివరి భాగంలో వర్షాలు పడ్డాయి,ఖరీఫ్ సీజన్లో మండలంలో ప్రధాన పంట అయిన మొక్కజొన్న పంటను రైతులు జూన్ మొదటి వారంలో సుమారు 8వేల హెక్టార్లు వేశారు.పంటలు మొలకెత్తి పెరగడంతో జూన్ మధ్య నుండి వర్షాలు లేకపోవడంతో మొక్కజొన్న పంట ఎండిపోవడం జరిగింది.దీంతో రైతులు చేసేది లేక కొంత భాగంగా దున్నివేశారు, ఈ విషయం రైతులు వ్యవసాయ అధికారులు దృష్టికి తీసుకుపోగా ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి పాములపాడు పరిసరాలు లోని మొక్కజొన్న పంటను పరిశీలించారు.అనంతరం రైతులకు సూచనలు ఇస్తూ మొక్కజొన్న పంట ఎండిపోకుండా యూరియాను ఒక లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున పిచికారి చేసుకోవాలని అంతేకాకుండా నానో యూరియాను లిక్విడ్‌ను కూడా స్ప్రేస్ చేసుకోవచ్చని అలాగే పొటాషియం పరమంగనెట్ కూడా స్ప్రే చేసుకోవడం వల్ల మొక్కజొన్న పంట వాడుకోకుండా ఉంటుందని వారు తెలిపారు. వ్యవసాయ అధికారంలో రైతులు ఉన్నారు.

అల్లర్లు సృష్టిస్తే అనచివేస్తాం

విశాలాంధ్ర - శిరివెళ్ల : ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అల్లర్లు సృష్టించిన కారణం అయినా చట్టపరమైన చర్యలతో అనచివేస్తామని సర్కిల్ ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, సబ్ ఇన్స్పెక్టర్ చిన్న పీరయ్య యాదవ్ పేర్కొన్నారు. సిఐ,ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శిరివెళ్ల మండలం యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో ఆదివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించి ప్రధాన కూడళ్లలో పోలీస్ కవాతు చేశారు. జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు కాటన్ సెర్చ్ నిర్వహించామన్నారు.గ్రామంలోని రౌడీ షీటర్ల నివాసాలు ప్రధాన కూడళ్ళు మరియు అనుమానస్పద నివాస వ్యక్తులతో సిఐ దస్తగిరి బాబు, ఎస్సై చిన్న పీరయ్య యాదవ్,రుద్రవరం ఎస్సై, పోలీస్ సిబ్బందితో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్న, చిన్న సమస్యలు ఎదురైనప్పుడు వాటిని గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని కక్షలు కార్పన్యాలు పెంచుకొని కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి జీవిత కాలమాన ప్రమాణాన్ని వృధా చేసుకోవద్దని తెలియజేశారు. రికార్డులు సక్రమంగా లేని పలు మోటార్ సైకిల్లను రెండఆటోలను తనిఖీ చేయడం జరిగిందని ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ తెలియజేశారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : దూదేకుల, ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేశారు. నంద్యాల రాజారెడ్డి కన్వెన్షన్ హాల్ నందు దూదేకుల సంఘ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున దూదేకుల, ముస్లిం మైనారిటీ 2025 పదో తరగతి విద్యార్థుల ప్రతిభ పురస్కార బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి సీనియర్ నేత ఏవి సుబ్బారెడ్డి, ఐఆర్ఎస్ విజేత సమీర్ రాజా,దూదేకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్,ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాష్ట్ర కోశాధికారి దస్తగిరి పర్ల,చమన్ ముద్దుబిడ్డ డాక్టర్ ఉమర్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ కబీర్ భాష, మహిళా సంఘ రాష్ట్ర నాయకురాలు డా. మస్తానమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, రాష్ట్ర గౌరవ సలహాదారులు సాయిబాబా, యూత్ రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కరిముల్లా వలి, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఇబ్రహీం, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కాసిం, కడప జిల్లా అధ్యక్షుడు బాషా, రిటైర్డ్ ఎమ్మార్వో షేక్షావలి, కౌన్సిలర్ జై నాబి, మహిళా నాయకురాలు సోక్రబి, వసుమతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పదవ తరగతి అనేది జీవితంలో తొలి విజయమని, భవిష్యత్తు విజయానికి తొలిమెట్టు లాంటిదని,ఉత్తమ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. దూదేకుల జాతి లోనే మొట్టమొదట ఐఆర్ఎస్ సాధించి బెంగళూరులో ఇన్కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేస్తున్న సమీర్ రాజా మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారంగా చదువుకొని తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం దాదాపు 105 మందికి 2000 రూపాయలు నగదు పురస్కారం, సర్టిఫికెట్, మెడల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు వాసవి దస్తగిరి, పట్టణ అధ్యక్షుడు కంకర శేక్షావల్లి, జిల్లా కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, పట్టణ కార్యదర్శి ఆదాం సాహెబ్, కోశాధికారి హుస్సేనప్ప, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం మహాద్భుతం

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణంలో పునర్నిర్మాణం చేస్తున్న హరిహర క్షేత్ర శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం రాబోయే రోజుల్లో భావితరాలకు పుణ్యక్షేత్రమైన యాత్రాస్థలంగా మారుతుందని ఢిల్లీ విశ్వహిందూ పరిషత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ, అయోధ్య రామ మందిర నిర్మాణము ఇంఛార్జి కప్పగంతుల కోటేశ్వరశర్మ అన్నారు.ఎంతో భక్తిశ్రద్ధలతో మొత్తం రాతిదూలాలతో అహర్నిశలు శ్రమించి నిర్మిస్తున్న ఆలయ పునర్నిర్మాణం మహా అద్భుతంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆదివారం పట్టణంలోని స్థానిక హరిహర శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానము పునఃనిర్మాణము పనులను ఢిల్లీ విశ్వహిందూ పరిషత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ,అయోధ్య రామమందిర నిర్మాణము ఇంఛార్జి కప్పగంతుల కోటీశ్వర శర్మ,కేంద్ర దక్షిణాది రాష్ట్రాల ఖాదీ కమీషన్ ఛైర్మన్ చంద్రమౌళి,ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచాక్ సురేంద్రలు కోడుమూరు చేరుకొని పునః నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరశర్మ మాట్లాడుతూ అద్భుతమైన ఆలయ పునర్ నిర్మాణం కోడుమూరులో ఎంతో అద్భుతంగా పెద్దపెద్ద రాతి దూలాలతో జరుగుతుందని తెలుసుకొని ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. ఇలాంటి దేవస్థానము నిర్మాణ పనులు చూడడం తాను అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ఇంతటి అద్భుతమైన దేవస్థానము నిర్మాణమును ప్రస్తుత కాలమములో చేయడము ఇక్కడి ప్రజలందరి అదృష్టమన్నారు. భవిష్యత్‌లో కోడుమూరులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము పునర్ నిర్మాణంతో ఇది పవిత్ర పుణ్యక్షేత్రంగా, ఒక యాత్రా స్థలముగా మారుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.అలాగే దేవస్థానము పునఃనిర్మాణ బాధ్యతను తీసుకున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి,ఆలయ కమిటీ సభ్యులను వారు అభినందించారు. ఈ దేవస్థానము పునః ప్రారంభోత్సవ కార్యక్రమాలన్నీ తానే దగ్గరుండి చేయిస్తానని కమిటీ సభ్యులకు ఆయన మాటిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజ శేఖర్,వేణుగోపాల్,ఎస్టీ దామోదర్, విజయ్, రంగస్వామి, కిషోర్,మధు సూదన్, రామకృష్ణ,వేంకటేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఎస్ సభ్యులు విటల్, జీతూరి రవి,శివకుమార్,నటరాజు, బీజేపీ నాయకులు కిరణ్,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ" నినాదంతో కూటమి మోసాలను ఎండగట్టాలని పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం కర్నూలు నగరంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి , జిల్లా పరిశీలకులు గంగుల ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమం జిల్లా అధ్యక్షులు యస్.వి. మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, అధికారంలోకి వచ్చాక మోసపూరిత పాలన సాగించడాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా రూపొందించిన "రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో"ను క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రజలకు అందించడానికి ప్రారంభించారు. "బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ" అనే నినాదంతో ప్రజలలో చైతన్యం రేకెత్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి ,జిల్లా పరిశీలకులు గంగుల ప్రతాప్ రెడ్డిలు మాట్లాడుతూ, ఎన్నికల ముందు అలవి కాని హామీలతో ప్రజలను నమ్మించారని, ఇంటింటికీ హామీల బాండ్లు పంపించి అధికారంలోకి వచ్చారని, కానీ ఒక్క హామీకి కూడా న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. 'సూపర్ సిక్స్' పేరుతో ప్రజలను మభ్యపెట్టారని, హామీలు నెరవేర్చమంటే మక్కలు విరగ్గొడతామంటున్న పవన్ కళ్యాణ్‌కు ప్రజలే గట్టి సమాధానం చెబుతారన్నారు.జిల్లా అధ్యక్షులు యస్.వి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్కో ఇంటికీ రూ.2.40 లక్షలు జమ అవుతాయంటూ బాండ్లు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇప్పుడు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారని వ్యాఖ్యానించారు. కొత్త పరిశ్రమలు వచ్చాయంటూ పచ్చ పత్రికల్లో పెయిడ్ ఆర్టికల్స్ వేయించుకున్నారని, వాస్తవానికి ఒక్క పరిశ్రమైనా తెచ్చారా అని నిలదీశారు. సమావేశంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి , ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, నగర మేయర్ బివై రామయ్య , పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరు ఇంచార్జ్ బుట్టా రేణుక, కోడుమూరు ఇంఛార్జ్ అదిపుల సతీష్, కర్నూల్ మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ,ఎమ్మెల్సీ మధుసూదన్ , జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలోని మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని తేజస్విరి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, 11 అంగన్వాడి ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో భాగంగా దొర్నిపాడు మండలంలోని వెంకటేశ్వర నగర్ లో అంగన్వాడీ కార్యకర్త (బిసి..ఈ) పోస్టు ఖాళీగా ఉందన్నారు. దొర్నిపాడు మండలానికి సంబంధించి దొర్నిపాడు- 5, అర్జునపురం (బిసి.. బి) అలాగే వెంకటేశ్వర నగర్ లో (ఎస్టి) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రుద్రవరం మండలానికి సంబంధించి పేరూరు-1 (ఎస్సీ), కోటకొండ-2 (ఓసి), పెద్ద కంబలూరు-2 (బిసి..డి) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే చాగలమర్రి మండలంలో చిన్న భోదనం (బిసి.. సి), వనిపెంట (ఓసి) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆళ్లగడ్డ మండలంలో ఆళ్లగడ్డ-8 (ఓసి) అలాగే ఉయ్యాలవాడ మండలం పుచ్చకాయ పల్లె (ఓసి), సిరివెళ్ల మండలం సిరివెళ్ల- 9 (ఓసి) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై 1-07-2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు ఉండేవారు. అదే గ్రామంలో నివసించేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు వెంట అవసరమైన ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలను జతపరిచి జూలై 1 నుంచి 10వ తేదీ సాయంత్రంలోగా తమ కార్యాలయంలో అందించాలన్నారు.

ఘనంగా అష్టావధానం

విశాలాంధ్ర -పత్తికొండ: పట్టణంలోని సాయిబాబా దేవాలయ ఆవరణంలో ఆదివారం 40 వ అష్టావధానం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ లు జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సవప్ప గారి ఈరన్న రచించిన 74 వ పుస్తకం విద్యార్థి శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. జనప్రియ కవి ఏలూరు ఎంగన్న అధ్యక్షతన జరిగిన సాహితీ సభలో శతావధాని ఉప్పల దడియం శరత్ శర్మ అష్టావధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, కమలా కళానికేతన్ సాహితీ సంస్థ వ్యవస్థాపకులు సవ్వప్ప గారి ఈరన్న, సాహితీ ప్రియులు గంగాధర్, బసప్ప, ఓంకార్, రాజేష్, సద్దాం హుస్సేన్, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య కోసం జూలై రెండు వరకు పెంపు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులకు, మండల విద్యాశాఖాధికారులకు, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయడమేమనగా, విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం సెక్షన్ 12 (1) ప్రకారం ఒకటవ తరగతి ఉచిత అడ్మిషన్స్ క్రింద మొదటి విడతలో మిగిలిన సీట్ల కొరకు రెండవ విడత లాటరీ ద్వారా 173 పాఠశాలలలో 1056 మంది విద్యార్థులకు సిట్స్ అలాట్ చేయడం జరిగింది. అడ్మిషన్స్ పొందడానికి చివరి తేదీ: 28/06/2025 నుండి 02/07/2025 వరకు సమయం పొడగించారు గమనించగలరు. ఆయా పాఠశాలలో ఇంకా ఉచిత అడ్మిషన్ పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులకు రెండవ విడత లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులందరూ చేరేలాగున తగు చర్యలు తీసుకోవలసినదిగా జిల్లా విద్యాశాఖాధికారి, ఎస్ సామెల్ పాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను తెలుసుకొనుటకు ఎ.పి సమగ్ర శిక్షా, కర్నూలు కార్యాలయంను మరియు ఆయా మండల విద్యాధికారి కార్యాలయం నందు సంప్రదించగలరు వారు కోరారు.

వొకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు బెస్ట్ ప్రిన్సిపాల్ ఆఫ్ ది ఇయర్ - 2025 అవార్డు ప్రదానం..

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : నీతి ఆయోగ్ ద్వారా అక్రిడిటేషన్, అఫిలియేషన్ పొందిన ఏసియా వేదిక్ష ఇంటర్నేషనల్ కల్చర్, రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ వారు విద్యా రంగంలో విశిష్ట సేవలను అందించినందుకు గాను కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యస్.నాగస్వామి నాయక్ "బెస్ట్ ప్రిన్సిపాల్ ఆఫ్ ది ఇయర్-2025" అవార్డును సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ అక్కుల రమేష్ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమావేశం హాలు నందు అందుకున్నారు. అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెన్నారెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్‌ను అభినందించారు.